

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

(ప్రారంభం)

**ప్రొలాగ్**

హైదరాబాద్ నడిబొడ్డులో వున్న రవీంద్రభారతిలో ఆ రాత్రి ఓ బాంక్ రిక్రియేషన్ క్లబ్ ఏనివర్సరీ సెలబ్రేషన్స్ జరుగుతున్నాయి.

గేటు దగ్గర, లోపల గుమ్మం దగ్గర 'స్టేట్ బేంక్ ఆఫ్ ఇండియా రిక్రియేషన్ క్లబ్ వెల్‌కమ్స్ యు' అని బట్టమీద రాయబడ్డ బోర్డులు వేలాడుతున్నాయి.

ఆడిటోరియం నిండుగా వుంది. ముందు వరుసలో దశరథరామయ్య, పక్కనే రాజేష్, సాంబశివరావు, నీరజ కూర్చుని ఉన్నారు. గత సంవత్సరం మూడో వరుసలో కూర్చున్న వాళ్ళు ఈ ఏడాది ప్రత్యేక ఆహ్వానితులుగా మొదటి వరుసలో కూర్చున్నారు. వాళ్ళు సరిగ్గా ఆరున్నరకి వచ్చారు. అందరి కళ్ళూ వాళ్ళమీదే. గత సంవత్సరానికి, ఈ సంవత్సరానికి మరో తేడా ఇదివరకు వాళ్ళు ఆడిటోరియంలోంచి వెళుతూండగా ఆసక్తిగా చూశారు. ఈసారి వారి రాక అందరిలో ఆసక్తిని రేకెత్తించింది.

సాంబశివరావు మిత్రుడు పంచాక్షరరావు సాంబశివరావు పక్కనే కూర్చున్నాడు. అతని భార్య సాహితి మాత్రం వంటరిగా, దూరంగా కూర్చునుంది.

పక్కనే వున్న మిసెస్ జగన్నాథంతో చెప్పింది సాహితి -

"మిసెస్ రావ్‌కి చెప్పనని మీరు నాకు మాట ఇచ్చినా రహస్యం మీరు ఆవిడకి చెప్పారని ఆవిడ ఇందాక చెప్పింది."

"అరె! మీరు చెప్పారన్న సంగతి ఎవరికీ చెప్పనని మీకు మాట ఇచ్చానని ఆ రహస్యం నా కావిడ చెప్పిందే?" పక్కావిడ ఆశ్చర్యపడింది.

"పోన్లెండి. ఆమె నాకు చెప్పిన సంగతి మీకు చెప్పానని ఆవిడకి చెప్పనని మాట యివ్వండి చాలు" చెప్పింది సాహితి.

"ప్రామిస్" చెప్పింది పక్కావిడ.

థియేటర్లో లైట్లారిపోయాయి. తెర లేచింది. ప్రార్థనా గీతం తర్వాత సెక్రటరీ రొటీన్‌గా ఏన్యువల్ రిపోర్ట్ చదివాడు.

తర్వాత గంభీరంగా చెప్పాడు.

"ఈ రోజు కార్యక్రమాలు ప్రారంభించబోయే ముందు ఓ విషయం. గత సంవత్సరం ఇదే ఆడిటోరియంలో జరిగిన సంఘటన మీకు గుర్తుండే ఉంటుంది. మన బేంక్‌లో మనతో పనిచేసే మిత్రుడు కె.సాంబశివరావు ఎలాంటి పరిస్థితిలో ఈ ఆడిటోరియం వదిలి వెళ్ళాడో మీ అందరికీ తెలుసు. ఈ విషయం ముందు క్లేరిఫై చేసి, ఆ తర్వాత ఇతర ప్రోగ్రాంలు మొదలుపెడదాం. మిత్రులు సాంబశివరావుని, ఆయన శ్రీమతి నీరజగారిని, మాష్టర్ రాజేష్ కుమార్‌ని స్టేజ్ మీదకి రావలసిందిగా కోరుతున్నాం."

"పదండి" చెప్పాడు వారి పక్కన కూర్చున్న పంచాక్షరరావు లేచి.

రాజేష్ తన పక్కన కూర్చున్న దశరథరామయ్య వంక చూశాడు. ఆయన వెళ్ళమన్నట్లుగా చిన్నగా నవ్వాడు. ముగ్గురూ వేదిక మీద వున్న కుర్చీలలో కూర్చున్నారు.

"ఇదే వేదిక మీద సాంబశివరావు గత సంవత్సరం రాజేష్ కొడుకు కాదన్నాడు. అసలా మాట ఎందుకు, ఏ పరిస్థితుల్లో అనాల్సివచ్చిందో ఇప్పుడు వివరిస్తారు."

సాంబశివరావు మైక్ ముందుకెళ్ళి నిలబడి చిరునవ్వు నవ్వి చెప్పాడు.

"గుడీవినింగ్ లేడీస్ అండ్ జంటిల్‌మన్. జరిగింది నే చెప్పేకంటే రాజేష్ బెస్ట్ ఫ్రెండ్ చెపితే బావుంటుంది. ఆయన్ని వేదికమీదకి తీసుకురావలసిందిగా ఆర్గనైజర్స్‌ని కోరుతున్నాను."

ఏడేళ్ళ రాజేష్ ఫ్రెండ్ అనగానే దాదాపు ఆ వయసుగలవారేమో అని ఊహించిన జనం, ప్రేక్షకులు ఆ బెస్ట్ ఫ్రెండ్‌ని చూసి ఆశ్చర్యపోయారు.

తెల్లటి మీసం, తెల్లటి గడ్డం, ఖద్దరు లాల్చీ, గ్లాస్కో పంచె, నుదుట గంధం బొట్టుమీద కుంకుమబొట్టు, గాంధీగారి మోడల్ కళ్ళజోడు.

ఆయన ముందు మైక్‌ని ఉంచారు. ఆయన ఓసారి కళ్ళజోడు సరిచేసుకుని చెప్పాడు.

"సభకు నమస్కారం. క్రితం ఏడాది నేనూ ఇదే ఆడిటోరియంలో ఉన్నాను. అయితే ఇక్కడ కాదు, మీ మధ్య ప్రేక్షకుల్లో."

ప్రేక్షకులవంక పరిశీలనగా చూసి మళ్ళీ చెప్పసాగాడు.

"వయసులో వున్న కుర్రకారు వంటరిగా వేరే చోటకి వెళ్ళి ఉద్యోగాలు చేసుకుంటూంటే, వాళ్ళు అడ్డదోవలు తొక్కడం నేటి మన సమాజంలో మామూలైపోయింది. ఇందుకు ప్రధాన కారణం మారిన విలువలు, మెండు అవకాశాలు. అసలేం జరిగిందో చెప్పేముందు సావిత్రి గురించి చెప్పక తప్పదు" ఆగి ఊపిరి పీల్చుకుని చెప్పసాగాడు.

"ప్రతిమానవుని జీవితంలో సగభాగం 'అయితే 'హాఫ్ లైఫ్ ఈజ్ ఇఫ్' అన్న ఆ ఆదర్శాన్ని నమ్మి, దాన్ని తన జీవితానికి సావిత్రి చక్కగా అన్వయించుకుంది. దాదాపు సంవత్సరంన్నర క్రితం మా అబ్బాయి సాంబశివరావుకి పెళ్ళి చేద్దామనుకున్నాను. ఆ రోజు నాకింకా గుర్తు...."

HALF OF LIFE IS 'IF'

2

పెళ్ళిళ్ళు స్వర్గంలో అవుతాయన్న సూక్తి భూమి మీద చాలా జంటల విషయంలో నిజం అవుతుంది.

నీరజకి, సాంబశివరావుకి పెళ్ళి అవుతుందన్న సంగతి వాళ్ళిద్దరికే తెలీదు. రెండు నెలల క్రితం నీరజని చూడటానికి పెళ్ళి చూపులకి వెళ్ళడానికి సాంబశివరావు ససేమిరా ఇష్టపడలేదు.

తన తండ్రి దశథరామయ్య పెళ్ళిచూపుల గురించి చెప్పగానే, నన్నడక్కుండా ఎందుకు ఈ ఏర్పాటు చేశావ్? నేను రాను" అని సమాధానం చెప్పాడు.

"ఎందుకు రావు?" అడిగాడు దశరథరామయ్య.

"నాకిష్టంలేదు."

"పెళ్ళిచూపులంటే ఇష్టంలేదా? లేక పెళ్ళంటేనా?"

"నీరజని నేను చేసుకోను."

"ఆ అమ్మాయి నీకు తెలుసా?"

"తెలీదు."

"మరి చూడకుండా ఎలా చెప్పగలుగుతున్నావ్ ఆ అమ్మాయిని యిష్టపడనని?"

"నేను చేసుకోవాలనుకునే అమ్మాయి నీరజ కాదు కనక."

"అయితే ఆ అమ్మాయి ఎక్కడుంటుంది?" నిగ్గదీశాడు.

"విజయవాడలో."

"అక్కడి పరిచయమా? మన కులమేనా?"

"సుబ్బరంగా."

"ప్రేమా?"

"అవును."

"మరి ఇంతకాలం నాతో చెప్పాల్సిన అవసరం లేదనుకున్నావా?"

"చెప్దామనుకుంటూంటే నువ్వే తొందరపడ్డావు."

"ఒసారి పెళ్ళిచూపులకి వస్తున్నామని చెప్పాక వెళ్ళకపోతే మర్యాదగా ఉండదు. నచ్చలేదని తర్వాత కబురు చేద్దాంకాని రేపు సాయంత్రం ఆఫీసునుంచి సరాసరి ఇంటికి రా. నీరజ నాన్నగారు నాకు మంచి స్నేహితుడు అందులో."

"వాళ్ళకెందుకీ శ్రమ నాన్నగారూ? మధ్యవర్తితో చెపితే పోతుందిగా."

"పోదు. మనం పెళ్ళిచూపులకి వెళుతున్నాం."

"నే చెప్పేది..."

"వెళుతున్నాం అన్నాను."

దశరథరామయ్యకి ఎదురుచెప్పే ధైర్యం సాంబశివరావుకు లేదు. మారుమాట్లాడలేదు.

నీరజ సాంబశివరావుని మొదటిచూపులోనే ఆకర్షించింది. తెల్లగా, సన్నగా, నాజూగ్గా వున్నా, కేవలం శారీరక సౌందర్యంకాదు సాంబశివరావుని ఆకర్షించింది. మాట్లాడే తీరు, సంస్కారం, ఇంకా అతనికే సరిగ్గా తెలీని ఆమెలోని ఏదో లోతైన గంభీరత సాంబశివరావుని ఆకట్టుకున్నాయి.

రెండు వారాల తర్వాత ఓ రోజు సాంబశివరావు దశరథరామయ్యతో చెప్పాడు - "నాకు మీ స్నేహితుడి అమ్మాయి నచ్చిందని కబురు చెయ్యండి నాన్నగారూ"

"ఎవరు నచ్చారు?"

"నీరజ."

"నీరజ నచ్చటం ఏమిటి?"

"మనం పెళ్ళిచూపులకని వెళ్ళాం, ఆ అమ్మాయి నచ్చింది."

"ఆ అమ్మాయి నీకు నచ్చలేదని, కోల మొహం వాళ్ళంటే చిన్నప్పటినుంచీ నీకు అయిష్టం అని నిన్ననే కబురు పంపేశాను."

"అరెరె"

"నీ విజయవాడ అమ్మాయిని తప్ప ఎవరినీ చేసుకోనన్నావుగా?"

"అప్పుడన్నాననుకో"

దశరథరామయ్య కొడుకు కళ్ళలోకి తీక్షణంగా చూశాడు కాసేపు.

"ఇంతేనా ప్రేమంటే?" అడిగాడు.

"నిన్న ఆ అమ్మాయినించి ఉత్తరం వచ్చింది. మేం వివాహం చేసుకోవడం కుదరదు నాన్నగారూ."

"ఏమైంది?"

"ఆ అమ్మాయి పనిచేసే ఆఫీసు బ్రాంచ్ హైదరాబాదులో నెలక్రితం ఎత్తేసారంట. ఇక్కడికి బదిలీకాదు. ఆ అమ్మాయి అక్కడ, నేనిక్కడ అయితే కష్టం. అందుకని."

"ఆ అమ్మాయి ఉద్యోగం మానేస్తే?"

"ఆ సంగతే రాసింది. ఉద్యోగం చేయటం అలవాటయ్యాక మానలేదట."

"అలా అయితే, మీ యిద్దరిమధ్య వున్నది ప్రేమ కాదు" తల అడ్డంగా ఊపుతూ విచారంగా చెప్పాడు దశరథరామయ్య.

నీరజ వెంటనే సమ్మతించలేదు. ఒకసారి నచ్చలేదు అన్నాక, తను అతనికి భార్య అవడానికి యిష్టపడలేదు. గుండ్రటి మొహం వాళ్ళనో, నలుచదరం మొహం వాళ్ళనో చూసుకోమని చెప్పింది తండ్రితో. పెద్ద వాళ్ళిద్దరూ కల్పించుకుని నచ్చచెప్పడంతో వాళ్ళ వివాహం అయింది.

ఇంకో గంటలో సాంబశివరావు, నీరజ శోభనం గదిలోకి వెళతారనగా, దశరథరామయ్య నీరజతో చెప్పాడు.

"అమ్మాయ్, ఆ గదిలోకి వెళ్ళేలోగా నీకో సలహా యివ్వదలచుకున్నాను."

ఏమిటన్నట్లు చూసింది మధుపర్కాలలో వున్న నీరజ.

"ఇది చాలా ముఖ్యమైన సలహా." ఈసారి సాంబశివరావు కూడా తండ్రివంక చూసాడు. ఆయన మొహంలో సీరియస్‌నెస్ గమనించాడు.

"మీ ఇద్దరూ భార్యాభర్తలు కాబట్టి ఒకరి గురించి మరొకరు అన్ని విషయాలూ పూర్తిగా తెలుసుకోవాలి."

సాంబశివరావు మొహంలో కొట్టొచ్చినట్లు ఆతృత కనబడింది. ఆయన తన భార్యకి ఏం చెప్పబోతున్నాడు. కొంపతీసి తన ప్రేమ విషయం గురించి కాదుకదా?

"దేన్ని గురించి?" అడిగింది నీరజ కూడా అంతే ఆసక్తితో.

"మా అబ్బాయికున్న ఓ అలవాటు గురించి."

నీరజ, సాంబశివరావుతోపాటు చుట్టుపక్కల వున్న బంధువులు కూడా అతనివంక చూస్తున్నారు.

"ఇకనుంచి మా అబ్బాయి ఎప్పుడూ గోడవైపు పడుకునేలా శ్రద్ధ తీసుకోవాలి నువ్వు" ఆగి చిన్నగా నవ్వుతూ చెప్పాడు.

"ఎందుకంటే, నిద్రలో మంచం మీంచి పడే అలవాటుంది మా సాంబశివరావుకి."

వెంటనే నీరజతోపాటు సాంబశివరావు కూడా సిగ్గుపడ్డాడు.

శోభనం రాత్రి నీరజ అడిగింది.

"నేను మీ భార్య అయ్యాక అడిగే ఈ మొదటి ప్రశ్నకి అబద్ధం ఆడకుండా సమాధానం చెప్పాలి."

"అడుగు."

"అబద్ధం ఆడకూడదు మరి."

"ఆడను. నిజం చెప్తాను."

"మొదట ఎందుకు నన్ను వద్దన్నారు?

సాంబశివరావు ఆ ప్రశ్న ఎదురు చూడలేదు. ఏ కారణం చెప్పాలో తెలియలేదు. కొన్ని క్షణాలు ఆలోచించినా ఏం తట్టలేదు. దాంతో నిజం చెప్పేశాడు.

"అప్పట్లో నేను ప్రేమించిన అమ్మాయిని చేసుకోవాలనుకున్నాను."

"మరెందుకు చేసుకోలేదు?"

ఈసారీ నిజమే చెప్పాడు.

"మీ ఇద్దరిమధ్యా శారీరక సంబంధం వుంది కదా?"

"లేదు."

"ఉండి ఉండాలే?"

"ఛ! లేదు."

"ఈ ప్రశ్నకి మాత్రం మీరు చెప్పిన సమాధానం అబద్దం."

"నిజం నీరజా"

"అబద్దం ఎక్కువ కాలం జీవించలేదు."

"అంటే?"

"అంటే ఏ లవ్ కాన్టులివ్ ఫరేలాంగ్ టైం."

"నన్ను అపార్థం చేసుకుంటున్నావ్."

"కాదు. అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. ఇంక వాదించకండి."

"నువ్వు..."

"నేను నేనే" నవ్వింది నీరజ.

ఆ నవ్వులో స్వల్పంగా దిగులు బయటపడింది. కానీ సాంబశివరావు దాన్ని గమనించలేదు.

"ఇది తాగండి" పాలగ్లాసు అందించింది సాంబశివరావుకి.

అనుకోని ఈ సంభాషణకి సాంబశివరావు తబ్బిబ్బవటం గమనించి నవ్వి చెప్పింది.

"గో ఎ హెడ్ నాలా మీకేం కొత్తకాదుగా."

"నీరజా! నన్ను అవమానిస్తున్నావ్."

"మిమ్మల్ని ఇక్కడెవరూ అవమానించటంలేదు. అనుమానించటంలేదు. ఓ సత్యం చెప్తున్నానంతే."

సాంబశివరావు పాల గ్లాసు తాక్కుండా యధాస్థానంలో వుంచి, పక్కకి తిరిగి పడుకున్నాడు. అతనికి కోపం వచ్చిందని గ్రహించింది నీరజ.

"మీకు ముప్పై ఒకటి కదా వయస్సు?" అడిగింది కాసేపాగి.

"ఊఁ"

"ఏం అలా అడిగావ్?"

"అందరిలా మీరు ఇరవై అయిదుకే ఎందుకు వివాహం చేసుకోలేదా అని చాలాసార్లు అనుకున్నాను."

నీరజ భర్త భుజం మీద మృదువుగా చెయ్యివేసి చెప్పింది.

"ఈ టాపిక్ ఇంక ఇక్కడితో ఆపేద్దాం. జీవితంలో మళ్ళీ ఎప్పుడూ ఈ టాపిక్ మనమధ్య రాకూడదు. "

"గుడ్"

"మరయితే ముందర పాలు తాగండి" చెప్పింది నీరజ.

ఆ అమ్మాయి పేరు ఏమయి ఉంటుందో అని ఆలోచించింది. భర్తని అడుగుదామనుకుంది. కానీ వాళ్ళమధ్య ఏర్పడ్డ సంధివల్ల అడగదలచుకోలేదు. ముందే అడిగివుంటే బావుండేది అనుకుంది నీరజ.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in